ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 2 డిసెంబరు 2024



వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన

కోనరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి, ఎగ్లాస్పూర్ గ్రామాల్లో ఆదివారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై ఆయా గ్రామాల ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. అటవీ సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు ఎండీ ఖలీలొద్దీన్, పల్లె శ్రీనివాస్, సుదర్శన్, అభిషేక్ రావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

దీనావస్థలో భీమేశ్వరాలయం

- వీటీడీఏ పరిధిలోకి తీసుకోని ప్రభుత్వం
- శిథిలమవుతున్న శిల్పసంపద
- 2011లో పురావస్తు శాఖ పరిధిలోకి



వేములవాడలోని భీమేశ్వరాలయం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రాచీనమైన కళా సంపదకు నిలయమైన వేములవాడలోని భీమేశ్వర ఆలయం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆలయ అభివృద్ధిని పట్టించుకునేవారు లేకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాజరాజేశ్వర స్వామి ప్రధాన దేవస్థానంతోపాటు వేములవాడకు వచ్చే భక్తులకు ఇతర సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.127.65 కోట్లతో దేవాలయ విస్తరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేశారు. ప్రధాన దేవస్థానం గోపురానికి రూ.6 కోట్ల నిధులతో 15 కిలోల బంగారు తాపడం చేపట్టాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలోనే వేములవాడలోని బద్దిపోచమ్మ దేవాలయ అభివృద్ధి, రోడ్లవిస్తరణ పనులకు రూ.20కోట్లు ఖర్చు చేశారు. బద్దిపోచమ్మ, రాజరాజేశ్వర స్వామి దేవాలయాల మధ్య ఉన్న భీమేశ్వరాలయంపై మాత్రం దయ చూపడం లేదు. రెండు శాఖల మధ్య భీమేశ్వరాలయం నిర్లక్ష్యానికి గురవుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2011లో భీమేశ్వరాలయం అభివృద్ధికి సంబంధించి పురావస్తు శాఖ తన ఆధీనంలోకి తీసుకుంది. దీంతో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా వివిధ పనులు చేపడుతున్న క్రమంలో పురావస్తు శాఖపరిధిలోని భీమేశ్వరాలయాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. పురావస్తు శాఖ పరిశీలన, ప్రతిపాదనలతోనే ఆగిపోయింది. ఎవరూ పట్టించుకోని పరిస్థితుల్లో ఆలయ అభివృద్ధి లేక శిథిలావస్థకు చేరుకుంటోంది.

ఖజురహో తరహాలో శిల్పకళ

దేశంలో వాస్తు శిల్ప కళలు, ఖజురహో శిల్పాలకు ప్రముఖ స్థానం ఉంది. అక్కడి శిల్పాలను చూడడానికి ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల ఉత్సాహ పడుతారు. పురాతనమైన దేవాలయాల్లో చెక్కబడిన అనేక శిల్పాల్లోని ప్రతీ కదలిక సంసారిక జీవనంతో ముడిపడి కనిపిస్తాయి. ఆలయాల గోడలపై చెక్కిన శృంగార దృశ్యాలు ఒక కావ్యంగా చూడవచ్చు. ఎక్కడో ఉన్న ఖజు రహో శిల్ప సందపదకు దగ్గరగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమేశ్వర ఆలయంలో కూడా చూడవచ్చు. దాదాపు 180శిల్పాలు ఉన్నాయి. దేవుళ్ల, దేవతలు, పురుషులు, స్త్రీలు నృత్యభంగిమలు, శృంగారం, అలంకరణలు వంటివి ఎన్నోశిల్పాలు..

మిగతా 8లో

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండం నేరేళ్ల గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోల శంకర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బోయిని పోచవ్వకు రూ. 20 వేల చెక్కు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. నాయకులు కోల అనంద్, పసుల లక్ష్మణ్, వంగ పెల్లి పర్శరాములు, శ్రీకాంత్, గణేష్ పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాతా

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం సభ్యులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆటాపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళా బృందం ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

ఆదర్శయూత్ కార్యవర్గం

రుద్రంగి, డిసెంబరు, 1 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని ఆదర్శ యూత్ కార్యవర్గన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆధ్యక్షుడిగా అల్లూరి గణేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీసరి కిషన్, కార్యదర్శిగా అల్లూరి రవీందర్ రెడ్డి, కోశాదికారిగా నల్ల సంజీవ్‌రెడ్డి ఎన్నికయ్యారు. యూత్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు వారు తెలిపారు.

4న ప్రజాపాలన సాంస్కృతిక కార్యక్రమాలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలలో భాగంగా సిరిసిల్లలో ఈ నెల 4వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజాపాలన, ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఈ నెల 4న సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్‌లోని సినారె కళామందిరంలో తెలంగాణ సంగీతా నాటక అకాడమీ హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజుల ఆధ్వర్యంలో కళాబృందాలు వివిధ కళారూపాలల్లో ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు గత సంవత్సరం కాలంలో సాధించిన విజయాలను ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. దీంతోపాటు జయ జయహే ప్రజాపాలన సాంస్కృతిక కార్యక్రమాలను సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

చిత్రకళతో ఎయిడ్స్‌పై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంఅడ్‌హెచ్‌వో వసంతరావు

సిరిసిల్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై అవగాహన కలిగించే దిశగా సిరిసిల్లకు చెందిన ప్రముఖ సైన్స్ రచయిత్రి డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ చిత్రకళతో ఏర్పాటు చేసిన అవగాహన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సృజన్ ఆస్పత్రిలో 'హెచ్‌ఐవీ స్టాప్' చిత్రాలతోపాటు వివిధ జబ్బులకు సంబంధించిన చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాణీప్రసాద్ వివిధ జబ్బులపై అందరికి అర్థమయ్యే విధంగా బొమ్మలు వేశారని, కవితల రూపంలో అవగాహన కల్పించడం ఆకట్టుకుంటుందని అన్నారు. హెచ్‌ఐవీపై అవగాహన కల్పించే చిత్రాలతో పాటు గతంలో కరోనా సమయంలోని చిత్రాలను వేశారన్నారు. బొమ్మలతో అవగాహన కల్పించే ఈ ప్రక్రియను వైద్య ఆరోగ్య శాఖ ఉపయోగించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ ప్రసాద్‌రావు, డాక్టర్ కె.స్వాప్నిక్, మేనేజర్ సృజన్, రవికుమార్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బీపీ, మధుమేహం వ్యాధి పరీక్షలను నిర్వహించారు. సుమారు 153 మందికి పరీక్షలు చేశారు. బీపీ, మధుమేహం వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కర్‌రెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, మహదేవ్, దేవయ్య, లక్ష్మణ్, రవి, దేవేందర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు

8



విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు
- ఆకట్టుకున్న సామూహిక కార్తీక దీపోత్సవం

8



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు పాటుపడాలి



విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు పాటుపడదామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో ఆదివారం దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో గ్రామాల్లో జాగీర్‌దారులు, దొరలు, భూస్వాముల ఆగడాలు పెరగడాన్ని దొడ్డి కొమురయ్య తట్టుకలేదన్నారు. వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో కొమురయ్య ఒకరని కొనియాడారు. ఆంధ్రామహాసభకు మద్దతుగా ఉద్యమించిన పోరాటంలో అసువులు బాసినట్లు చెప్పారు. కొమురయ్య అమరత్వంతోనే సాయుధ పోరాటం ప్రారంభమైందన్నారు. అనంతరం మండలంలో ప్రకృతి రిసార్ట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డీసీపీ రాహుల్‌హెగ్డే, మాజీ జడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ, కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, జిల్లా కురుమ సంఘం విద్యాకమిటీ అధ్యక్షుడు పోలే శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, జిల్లా అధ్యక్షుడు కనుకయ్య, కురమ సంఘ మండల అధ్యక్షుడు పర్స అయిలయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు వినయ్‌కుమార్, బెరెడ్డి మహేందర్ రెడ్డి, పసుల వెంకటి, రమేష్ పాల్గొన్నారు.

- మండలంలోని పొత్తూరులో ఆవిష్కరించిన దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు ఆదివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాల ప్రజల గుండెల్లో ఆత్మస్థైర్యం నింపిన గొప్ప వ్యక్తి కొమురయ్య అన్నారు. కొమురయ్య ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు.మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, నాయకులు పట్నం అశ్విని శ్రీనివాస్, గుంటి అంజయ్య పాల్గొన్నారు.

జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కుంగ్‌ఫూలో జిల్లాకు చెందిన సిరిసిల్ల స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు సత్తా చాటాచారు. ఆదివారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని జక్రి ఫంక్షన్ హాల్‌లో బీఎస్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కుంగ్‌ఫూ అండ్ కరాటే పోటీలను నిర్వహించారు. 12 సంవత్సరాలలోపు బాలుర వ్యక్తిగత వెపన్ కటా విభాగంలో భోగ నరేష్ స్వర్ణం, హ్యాండ్ బేర్ విభాగంలో వంగ శ్రీమన్ స్వర్ణం సాధించారు. బీఎస్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ బండారి సంతోష్, సీనియర్ మాస్టర్ కొండెళ్ల సదానందం విద్యార్థులు నరేష్, శ్రీమాన్‌కు స్వర్ణ పతకాలు అందజేశారు. సిరిసిల్ల స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- సీఎం కప్ పోటీలు ప్రారంభం



2 కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, దేహ దారుఢ్యానికి దోహదపడుతాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లాలో ఆదివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో సీఎం కప్ పోటీల్లో 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను ప్రభుత్వం పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా సిరిసిల్ల జిల్లాలో 2 కే రన్ నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు, యువత చదువుతోపాటు నిత్యం కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేష్‌కుమార్, డీవైఎస్‌వో రాందాస్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, పీడీ, పీఈటీలు, వాలీబాల్ అకాడమీ క్రీడాకారులు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

జీవో 317ను సవరించాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవో 317ను సవరించాలని తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జీవోలో అసంబద్ధమైన నిబంధనలతో పలువురికి నష్టం వాటిల్లుతోందని, సవరించి వారికి న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడంతో బాధిత ఉద్యోగుల్లో ఆనందం వెల్లువిరిసిందని, సబ్ కమిటీ ఆరు నెలల పాటు శోధించి సాధించింది ఏమిలేదని విమర్శించారు. జీవో 317పై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని, వెంటనే స్పందించి ఈ జీవో బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- రుద్రంగికి 108 అంబులెన్స్- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సభ్యులు

రుద్రంగి, డిసెంబరు, 1 (ఆంధ్రజ్యోతి) ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రంగిలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. రుద్రంగిలో నూతనంగా నిర్మించబోయే ఆస్పత్రి పనులను ఆరు నెలల్లో పూర్తి చేయించనున్నట్లు చెప్పారు. ఇటీవల రుద్రంగికి రూ.42 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేశామన్నారు. రుద్రంగి మండలానికి 108 అంబులెన్స్ మంజూరైందన్నారు. వేములవాడ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి రూ.1000 కోట్లు మంజూరు చేశారన్నారు. రుద్రంగితోపాటు వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా తుర్కాశీకాలనీ

- డ్రైయినేజీలు లేక రోడ్లపై మురికినీరు
- వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు



సిరిసిల్లలోని తుర్కాశీకాలనీ



కాలనీలో పని చేయని మిషన్ భగీరథ నల్లా

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణ పరిధిలోని తుర్కాశీకాలనీలో సమస్యలు పేరుకుపోయాయి. పట్టించుకునేవారు లేకపోవడంతో స్థానికులు సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు పరిధిలో పెద్దూర్ శివారులో తుర్కాకాశీకాలనీలో 120 కుటుంబాలు ఉంటున్నాయి. రెండో బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న గుట్టల్లో బండలను కొట్టుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాలనీలో నివాసం ఉంటున్న కుటుంబాలకు గతంలో రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాలను అందించారు. చాలా మంది ఆ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. పెద్దూర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అ కాలనీలో మురికికాలువలను నిర్మించకుండానే సిమెంట్‌రోడ్లను వేశారు. ఆ గుడిసెలనుంచి వచ్చే మురికినీరు అంతా రోడ్లపై నిలిచిపోతోంది. చెత్తాచెదారం మొత్తం గాలికి వచ్చి ఆ మురికి నీటిపై చేరుతోంది. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రభుత్వం మంచినీటి ట్యాంక్‌తోపాటు మిషన్‌భగీరథ కింద ఇంటింటికి తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన నల్లా ద్వారా వారానికి రెండు సార్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. కాలనీవాసులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు స్థానిక మసీద్ ఎదుట బోర్‌వేసి నీటిని అందిస్తున్నారు. కరెంట్ లేని సమయంలో నీటికి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తుర్కాకాశీకాలనీ వాసులకు గత ప్రభుత్వం కమ్యూటీ హాల్‌ను మంజూరు చేయగా గ్రామస్థులు చందాలుపోగుచేసి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ కమ్యూటీ హాల్ నిర్మాణం చేపట్టినా నిధులు సరిపోవడం లేదని మధ్యలోనే నిలిపివేశారు. ఐదేళ్లుగా పనులు అక్కడే ఆగిపోయాయి. భవనాన్ని పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. సిరిసిల్ల- కామారెడ్డి ప్రధాన రోడ్డు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో కాలనీ ఉంటుంది. రోడ్డుకిరువైపులా విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేసినా కాలిపోయి చీకటి అలుముకుంటోంది. మరమ్మతు చేయించకపోవడంతో చీకట్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. స్థానిక కౌన్సిలర్‌తోపాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని, సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

- షేక్ అలీ, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు



తుర్కాశీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మురికికాలువలు నిర్మించాలి. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు - సిరిసిల్లలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



సిరిసిల్లలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

సిరిసిల్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏటా హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం పడుతున్నాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ ప్రధానాస్పత్రి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ అరక్షిత శృంగారం, వాడిన సూదులు మరొకరు వాడ డం, ఎయిడ్స్ బాధితుల రక్తాన్ని ఇంకొకరికి ఎక్కించడంతో వ్యాధి ఇతరులకు సోకు తుందన్నారు. తల్లుల నుంచి పిల్లలకు సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఎయిడ్స్ బాధితులను తాకినా, ముట్టుకున్నా వ్యాప్తి చెందదన్నారు. ఎయిడ్స్ నిరోధానికి మందులేదని, వైరస్‌ను అదుపుచేసే మందులు వచ్చాయని అన్నారు. సిరిసిల్లలో హెచ్‌ఐవీ కేసులు 1900 ఉండగా 54 0 మంది లింక్ యాంటీ మెట్రో థెరపీ మందులు వాడుతున్నట్లు చెప్పారు. సిరిసిల్ల ఆస్పత్రిలోని ఐసీటీసీలో హెచ్‌ఐవీ టెస్టులు చేస్తున్నామన్నారు. ఆర్ఎంవో డాక్టర్ కాశీనాథ్, డీసీహెచ్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ బాబు, నర్సింగ్ కళాశాల కో ఆర్డినేటర్ సంధ్య, డీపీఎంవోలు చేపూరి శ్రీనివాస్, కూన సురేష్, దేవీసింగ్, ఐసీటీసీ కౌన్సెలర్ గంగయ్య, సత్యనారాయణ, బాలయ్య, బిగిందర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా

హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్ బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూవిస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోలోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో

రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్టు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

కాయ్ రాజా కాయ్..

జూదం ఆడేందుకు శ్రీలంక, నేపాల్‌కు జిల్లావాసులు

- కమీషన్ తీసుకుని పంపిస్తున్న ఏజెంట్లు



కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడేందుకు జిల్లావాసులు పెద్ద ఎత్తున పేకాటరాయుళ్లు శ్రీలంక, నేపాల్, వియత్నాం, కంబోడియా వంటి దేశాలకు వెళుతున్నారు. రాష్ట్రంలో పేకాట క్లబ్‌లు మూసివేయడంతో జిల్లాలో జూదం చాలామట్టుకు తగ్గిపోయింది. దీంతో పేకాటరాయుళ్లు దొంగచాటుగా కొన్ని ప్రాంతాల్లో స్థావరాలుగా ఏర్పాటు చేసుకుని రమ్మీ, తీన్‌పత్తా, ఇతర రకాల పందెం ఆడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులకు చిక్కుతుండడంతో సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకుని జూదం ఆడుతున్నారు. కొంతకాలం క్రితం వరకు జిల్లా నుంచి చాలా మంది గోవాకు వెళ్లి అక్కడ క్యాసినో ఆడేవారు. మహారాష్ట్ర సరిహద్దులో అక్రమంగా ఏర్పాటు చేసిన ఒక స్థావరంలో బహిరంగంగానే పేకాట ఆడేవారు. ఇటీవల ఆ స్థావరాన్ని మూసివేయడంతో ఇతర దేశాలకు వెళ్లి జూదం ఆడుతున్నారు.

- ప్రత్యేక ఆఫర్లు

శ్రీలంక, నేపాల్, వియత్నాం, కంబోడియా వంటి దేశాల్లో క్యాసినోకు అక్కడి ప్రభుత్వ అనుమతి ఉండడంతో జిల్లాకు చెందిన చాలా మంది వ్యాపారులు, రియల్టర్లు, ఉద్యోగులు, విదేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపు తున్నారు. దీనిని క్యాష్ చేసుకు నేందుకు అక్కడి క్యాసినో నిర్వాహకులు జిల్లాలోని కొందరిని ఏజెంట్లుగా నియమించుకున్నారు. ఆఫర్లను ప్రకటిస్తున్నారు. కరీంనగర్ నుంచి ఇతర దేశాలైన శ్రీలంక, నేపాల్‌లోని ఖాట్మాండుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏజెంట్లకు ఒక్కొక్కరిపై 10 శాతం కమీషన్‌ను అక్కడి సంస్థలు చెల్లిస్తున్నాయి. ఈ ఆఫర్‌లో వెళ్లాలంటే ప్రతి కస్టమర్ రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు డిపాజిట్‌గా పెట్టాల్సి ఉంటుంది. ఆ డబ్బులకు సరిపడా కాయిన్స్ అందిస్తారు. జూదం పూర్తి అయిన తరువాత డబ్బులు గెలుచుకుంటే కాయిన్స్‌కు సమానంగా నిర్వాహకులు డబ్బులు చెల్లిస్తారు.

డబ్బులు పోగొట్టుకుని.. అప్పులపాలై..

విదేశాలకు వెళ్లి జూదం ఆడుతున్న వారు 90 శాతం మంది డబ్బులు పోగొట్టుకుని ఇంటికి వస్తున్నారు. జూదంలో ఒక వైపు డబ్బులు పోతున్నప్పటికీ సంపాదించుకోవచ్చనే ఆశతో మళ్లీ మళ్లీ ఆడుతూ లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. జిల్లా నుంచి శ్రీలంక, ఖాట్మాండు, ఇతర దేశాలకు వీకెండ్‌లో 40 నుంచి 50 మంది క్యాసినో ఆడేందుకు వెళుతున్నట్లు సమాచారం. వీరందరితో ఏజెంట్లు కొన్ని వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి సమాచారాన్ని పంచుకుంటున్నారు. కొందరు యువకులు స్నేహితులతో టూర్‌కు వెళుతున్నట్లుగా కుటుంబ సభ్యులకు చెబుతూ క్యాసినో ఆడేందుకు వెళుతున్నారు. యువకులు ఈ వ్యసనం బారినపడి అప్పులపాలవుతున్నారు. పోలీసులు ఇటువంటి వ్యవహారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఓబులాపూర్ శివారులో టేకు వనం

అబ్బురపడేలా..

వన సంరక్షణ

- ఇరవై ఏళ్ల క్రితమే హరితహారం..
- ఓబులాపూర్ గ్రామస్థుల సమష్టి కృషి..
- పెరిగిన అటవీ విస్తీర్ణం

మల్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామస్థుల సమష్టి కృషితో అటవీ విస్తీర్ణం పెరిగింది. గ్రామస్థులు ఐక్యతతో ఇరవై ఏళ్ల క్రితమే హరితహారానికి ఇక్కడ నాంది పలికారు. రాష్ట్ర ప్రభుత్వం గత కొనేళ్లుగా హరితహారం పేరిట కార్యక్రమాలు చేపట్టగా, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు గతంలోనే వనసంరక్షణ, వనాల పెంపునకు ఈ గ్రామస్థులు తీసుకున్న కృషికి సార్క్‌దేశాలే అబ్బుర పడ్డాయి. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడును కూడా ఆకర్షించగా, ఆయన ఇక్కడి గ్రామస్థులను అభినందించారు. వివరాలలోకి వెళితే.. మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామం అటవీ ప్రాంతంలో పచ్చని గుట్టల మధ్య ఉంది. ఈ గ్రామ పరిధిలో ఇక్కడ దాదాపు 4,619 ఎకరాల పరిధిలో అటవీ విస్తీర్ణం ఉంది. అప్పటి ప్రభుత్వం వనసంరక్షణ సమితిలను ఏర్పాటు చేయగా ఇక్కడ కూడా గ్రామస్థులు రాజకీయాలకు తావీయకుండా సమష్టిగా వనం పెంపునకు కృషి చుశారు. ముఖ్యంగా టేకు వనాన్ని పెంచడంతో నేడు ఈ ప్రాంతంలో అటవీ విస్తీర్ణం పెరిగింది. దాదాపు 5వేల ఎకరాల్లో టేకు వనం పరచుకుంది. అటవీశాఖతో పాటు గ్రామస్థుల పర్యవేక్షణ నేటికీ కొనసాగుతోంది.

● సార్క్‌దేశాల గుర్తింపు.. చంద్రబాబు ప్రశంసలు

ఓబులాపూర్ గ్రామస్థుల సమష్టి కృషితో అటవీ విస్తీర్ణం పెరగడంతో అప్పట్లో సార్క్ దేశాలను ఆకట్టుకుంది. 20 ఏళ్ల క్రితం గోవాలో జరిగిన సార్క్ సదస్సులో 8 దేశాల ప్రతినిధులు పాల్గొనగా అప్పటి వీఎస్ఎస్ చైర్మన్ వెంకటి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమష్టి కృషిని వివరించారు. దీంతో సార్క్ దేశాల ప్రతినిధులు వారి విజయగాథను తెలుసుకొని వీరి కృషిని అభినందించారు. ఓగులాపూర్ గ్రామస్థుల కృషిని, వనసంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామస్థుల కృషిని అభినందిస్తూ ప్రశంసాపత్రం పంపించారు. అటవీ అభివృధికి నిధులు మంజూరు చేస్తు ఓగులాపూర్ వాసుల ఆధర్శాన్ని కొనియాడారు.



టేకు వనంలోని చెట్లు

● అందరి బాధ్యతగా వన సంరక్షణ

గ్రామ పరిధిలో 5వేల ఎకరాలకు విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాన్ని గ్రామస్థులు దాని సంరక్షణతో పాటు వాటర్ షెడ్, రాక్‌ఫల్ డ్యాంలు నిర్మించి ఆదర్శంగా నిలిచారు. నాటి వన సంరక్షణకు ఇటీవల బీటలు వారుతున్నాయని, ఈ ప్రాంతంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే వనసంరక్షణ ఫలాలు ముందు తరాలకు చేరుతాయని గ్రామస్థులు అంటున్నారు.టేకు వనం కంటికి రెప్పగా కాపాడుకుంటున్నామని, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన దీన్ని మరింత గుర్తించి పోత్సాహించాలని కోరుతున్నారు.

పట్టభద్రుల గొంతుక వినిపిస్తా..

- నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి - అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'విద్యాసంస్థల యజమానిగా నేను ఎంతో మందిని విద్యావంతులుగా తయారు చేశా.. చదువుకున్న వారి సమస్యల పరిష్కారానికే రాజకీయాల్లోకి వచ్చా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదిస్తే చట్టసభల్లో పట్టభద్రుల గొంతుక వినిపిస్తా'.. అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ తాను మూడు నెలలుగా కరీంనగర్, ఆదిలాబా ద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించాన న్నారు. ఈ సందర్భంగా విద్యావంతులు, నిరుద్యోగులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులను కలిసి వారితో చర్చించి సమస్యలు తెలుసుకున్నానన్నారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని సంపూర్ణమైన మద్దతు తెలుపడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈరోజు పట్టభద్రులంటే ఎవరికీ పట్టనివారుగా, భద్రతలేని వ్యక్తులుగా తయారయ్యారన్నారు. వీఎస్ఆర్ టీమ్ ద్వారా రెండు లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించామని, దీనికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. విద్యాసంస్థల యజమానిగా ఉన్న అనుభవంతో రాబోయే రోజుల్లో నిరుద్యోగ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారందరికి హెల్త్ కార్డు సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. ఈనెల 2వ తేదీ నుంచి కరీంనగర్‌లో టెట్ కోచింగ్ ఉచితంగా ఇప్పిస్తానని తెలిపారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న వీఎస్ఆర్ అభిమానులు, విద్యార్థులు

- భారీ బైక్ ర్యాలీ

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ఆదివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వావిలాలపల్లి అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్ మైదానం నుంచి 1500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎస్ రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎ నరేశ్, కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, సుక్మా స్టేట్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, తానిపర్తి తిరుపతిరావు, చిదుర సురేశ్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, అపూర్వ విద్యాసంస్థల అధినేత వేణు, వి సతీష్‌కుమార్, కనకం వంశీ, కేశిపెద్ది శ్రీధర్‌రాజు, రాజిరెడ్డి, కిషన్‌నాయక్, పెంద్యాల కేశవరెడ్డి, ఎర్రంశెట్టి మునీందర్, ప్రభాకర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, మజీద్, అజీజ్, సర్దార్ శార్దూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో ఎస్‌యూ వీసీ పూజలు

ధర్మపురి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన ఇద్దరి అరెస్ట్

జ్యోతినగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ మెయిన్ రోడ్డులోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో నవంబరు 26వ తరేదీ రాత్రి చోరీకి యత్నించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26న ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేసిన విషయంలో బ్యాంకు మేనేజర్ రణధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ కేసులో నిందితులు తుమ్మల మధు(నందిగామ, కృష్ణా జిల్లా ఏపీ), బండ్ల అబ్రహం(నందిగామ)లను ఆదివారం అరెస్టు చేసి వారు చోరీకి ఉపయోగించిన వస్తువులు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు. నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసిన ఎస్ఐ ఉదయ్‌కిరణ్ పీసీలు టి అంజయ్య, జె శ్రీనివాస్‌ను రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

బీర్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం ఓ లారీ బ్రేకులు ఫెయిలై పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. కోదాడ నుంచి జగిత్యాల మీదుగా రెండు లారీలు జన్నారం వెళ్తున్నాయి. ఒకదాని వెనుక ఒకరి వస్తున్న క్రమంలో బీర్‌పూర్ ఘాట్ రోడ్డు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయి ముందున్న లారీని ఢీకొని అదుపు తప్పి పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి లారీ యాజమానులకు సమాచారాన్ని అందించారు. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్(35) అనే యువకుడు 12 రోజుల క్రితం దుబాయ్‌లో ఆత్మహ త్య చేసుకొని మృతి చెందగా మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. చివరిచూపుల అనంతరం గ్రామశివారులో అంత్యక్రియలు నిర్వహించారు. దండ్ల శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధుమిత్రులు కోరారు.

కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు

- నేటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు
- అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అప్రమత్తమైన పోలీసులు

మంథని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు సోమవారం నాటితో 25 ఏళ్లు నిండాయి. ఉమ్మడి రాష్ట్రంలోని మంథని నియోజకవర్గం మల్హర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో 1999 డిసెంబరు 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పటి పీపుల్స్‌వార్ గ్రూపునకు చెందిన ముగ్గురు అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు అసువులుబాశారు. వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా మావోయిస్టు పార్టీ 2000 డిసెంబరు 2న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)ను ఏర్పాటు చేసింది. ఏటా డిసెంబరు 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

- సామాన్య కార్యకర్తలుగా చేరి..

పీపుల్స్‌వార్ ఉద్యమాన్ని దేశ విప్లవోద్యమ చరిత్రలో అగ్రభాగాన నిలిపిన సాయుధ కమ్యూనిస్టు పోరాట సిద్ధాంత


అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

నిర్మాతలు నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యాం, శీలం నరేష్ అలియాస్ మురళి, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేష్‌లు


నల్లా ఆదిరెడ్డి (ఫైల్)


ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (ఫైల్)


శీలం నరేష్ (ఫైల్)

విప్లవోద్యమంలోనే అసువులు బాసారు. మంథని నియోజకవర్గంలోని మల్హర్ మం డలం కొయ్యూరు(ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు సామాన్య కార్యకర్తలుగా పీపుల్స్‌వార్‌లో చేరి క్రమశిక్షణతో, అంకితభావంతో


సంఘటన స్థలంలో సంతోష్‌రెడ్డి మృతదేహం(ఫైల్)

పనిచేసి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. రెండున్నర దశాబ్దాల పాటు విప్లవోద్యమంలో పనిచేసిన వారు కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. వారి స్మృతిలో, స్ఫూర్తితో ఆవిర్భవించిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)కి సోమవారం నాటితో 24ఏళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో పీఎల్‌జీఏ వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు మావోయిస్టు అగ్రనేతలు పిలుపునివ్వగా, అడ్డుకునేందుకు పోలీసు బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కాగా, పీఎల్‌జీఏ వారోత్సవాల ప్రారంభానికి ముందు రోజే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక వద్ద ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో జిల్లాకు చెందిన మావోయిస్టు నాయకుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు(43) మృతిచెందాడు. దీంతో మంథని నియోజకవర్గంలోని అటవీగ్రామాల్లో అలజడి నెలకొంది.

గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాపూర్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్నారనే ఖచ్చితమైన సమాచారంతో సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సుధాకర్, స్థానిక ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం దాడి చేశారు. కరీంనగర్ పట్టణానికి చెందిన వ్యక్తి సయ్యద్ అబ్దుల్ బాసిత్ వద్ద నుంచి 80 గ్రాముల ఎండు గంజాయితో పాటు ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. సయ్యద్ అబ్దుల్ బాసిత్ గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలోని యువకులకు విక్రయిస్తున్నాడని తెలిపారు. గంజాయి విలువ నాలుగువేల రూపాయలు ఉంటుందని చెప్పారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని తమకు అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ రమాకాంత్ సూచించారు.

నాలుగు ట్రాక్టర్లు పట్టివేత

మానకొండూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ మేరకు నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోద చేశామని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

- బాలికల విభాగంలో కరీంనగర్.. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు విజయం

హుజూరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలు ఆదివారం ముగి శాయి. మొదట క్రీడాకారులను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ పుల్ల శోభన్‌కుమార్ పరిచయం చేసుకొని ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థు లు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అడిషనల్ ఎస్పీ శోభన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థు లు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. తాను ఆటలతోనే ఈ స్థాయికి ఎదిగానన్నా రు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదీ ఇష్టమో దానిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్


బాలికల విభాగంలో గెలుపొందిన కరీంనగర్ జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

చైర్‌పర్సన్ గందె రాధిక, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, వర్థినేని రవీందర్‌రావు, బండ శ్రీనివాస్, గుడిపాటి జైపాల్‌రెడ్డి, సారయ్య, రాజిరెడ్డి, ఉమాయ్య, శ్రీనివాస్, రమేష్, రవికుమార్, శ్యామ్‌కు మార్, తిరుపతి, యూసఫ్, సజ్జు, రాకేష్, రాజు పాల్గొన్నారు.

- విజేతలు వీరే..

హుజూరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో బాలుర విభాగంలో నిజామాబాద్‌పై ఆదిలాబాద్ రెండు గోల్స్ చేసి విజయం సాధించింది. బాలికల విభాగంలో నిజామాబాద్‌పై కరీంనగర్ జట్టు రెండు గోల్స్ సాధించి విజేతగా నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

హుజూరాబాద్‌లో నిర్వహించిన హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేశారు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన నిమ్మటూరి మిధున, మాటూరి అవిజ్ఞా, షైటి ఏజెంల్, సహస్ర, చింతల పరిణీత ఎంపికయ్యారు. ఈ నెల 9న మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి హాకీ పోటీ ల్లో వీరు పాల్గొంటారని హుజూరాబాద్ హాకీ క్లబ్ గౌర వ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షు డు బండ శ్రీనివాస్ తెలిపారు.

రైతుల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రావు

చిగురుమామిడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక అభివృద్ధికి పాడి పరిశ్రమ ద్వారా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టరు వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో ఆదివారం జాతీయ సేవా పథకంలో భాగంగా పీవీ నరసింహారావు తెలంగాణా వెటర్నరీ యూనివర్సిటీ కోరుట్ల కళాశాల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 82 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేశామని చెప్పారు. పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండోచైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, పాల కేంద్రం చైర్మన్ ఠాకూర్ నరేందర్ సింగ్, వైద్యులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరు

- ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

పెద్దపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందే ప్రాజెక్టులను చేపడతామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఆయన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదట ధాన్యం కొనుగోళ్లపై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తికరంగా ఉందన్నారు. 4వ తేదీన సీఎం పర్యటన ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. సీఎం పర్యటన సమయానికి వంద శాతం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించాలని ఆదేశించారు. రోళ్ల వాగు ప్రాజెక్టుకు అటవీ భూముల సేకరణను నీటి పారుదల శాఖ భూసేకరణ, ఆర్అండ్ఆర్ కోసం ప్రత్యేకంగా కేటాయించిన అధికారితో సమన్వయం చేస్తూ పూర్తి చేయాలన్నారు. యాసంగి పంటకు నీటి విడుదలపై సమగ్ర


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రణాళిక తయారు చేసి రైతులకు స్పష్టమైన సమాచారం కలెక్టర్ల ద్వారా అందిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ సేకరణకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేస్తామన్నారు. కాల్వ పనులు త్వరగా చేపట్టేలా స్థానిక రైతులతో మాట్లాడి కోర్టు కేసు విత్‌డ్రా చేయించాలని మంత్రి ప్రజాప్రతినిధులను కోరారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఐదు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని అన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరు వరకు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు సాగు నీరు అందించాలని మంత్రి సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని ప్యాకేజీ-9 పెండింగ్ పనులు, చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెద్దపల్లిలో 4న లక్ష మందితో జరిగే యువ వికాసం సభను విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

- చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది..

గత పాలకుల వల్ల చిన్న కాళేశ్వరం ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలని అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. పోతారం ఎత్తిపోతలకు పథకం, భీంఘనపూర్ ఎత్తిపోతల పథకం పనుల ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు.

- గౌరవెల్లి, గండిపల్లి పనులను పూర్తి చేయాలి

గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టులను లింక్ చేసి సమాంతరంగా నిర్మాణపనులు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి బండ్ నిర్మాణం చివరి దశలో ఉందని, కాలువల పనులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా జరుగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో పెద్దపల్లి జిల్లా వాసి మృతి

- మృతుడు డివిజన్ కమిటీ కార్యదర్శి ఏగోలపు మలయ్య

కోల్‌సిటీ/పాలకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక వద్ద ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్దపల్లి జిల్లాకు చెందిన ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు(46) మృతిచెందాడు. మల్లయ్య ఏటూరునాగారం-మ హదేవపూర్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడిపై తెలంగాణ పోలీసులు ఎనిమిది లక్షల రూపాయల రివార్డును గతంలో ప్రకటించారు. మృతుడిది పాలకుర్తి మండలం రాణాపూర్ స్వగ్రామం. ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. 1995లో మల్లయ్య అజ్ఞాతంలోకి వెళ్లాడు. 18ఏళ్ల వయసులోపే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు గ్రామస్థులు పేర్కొంటున్నారు. మొదట దళ సభ్యుడిగా పని చేసిన ఆయన అనంతరం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దండకారణ్యంలో పనిచేశాడు. ఉత్తర తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాల విస్తరణలో భాగంగా బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి, ఏగోళపు మల్లయ్యలకు బాధ్యతలు అప్పగించారు. ఏగోళపు మల్లయ్య అటవీ ప్రాంతమైన మహదేవపూర్, ఏటూరునాగారం డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. సుమారు 30 ఏళ్లు పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల్లో పనిచేసిన ఆయనకు ఈ ప్రాంతంపై పట్టు ఉండడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు ఏటూరు నాగారానికి వెళ్లారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మల్లయ్య మృతదే హం ఫొటోలను రాణాపూర్ గ్రామస్థులు సరిగా గుర్తించలేకపోయారు. మల్లయ్య 30ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లడంతో స్థానికులకు పోల్చులేక పోయారు. ఎట్టకేలకు కుటుంబసభ్యులు గుర్తించినట్టు పోలీసులు పేర్కొంటున్నారు.


ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు మృతదేహం

- రాణాపూర్‌లో విషాదఛాయలు..

ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాలకుర్తి మండలంలోని రాణాపూర్‌కు చెందిన ఏగోలపు మల్లయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఏగోలపు గట్టయ్య-వెంకటమ్మ దంపతులకు రాజయ్య, లచ్చయ్య, శ్రీనివాస్, మల్లేష్ నలుగురు కుమారులతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుల్లో చిన్నవాడైన మల్లేష్ 1995లో గ్రామంలో జరుగుతున్న భూస్వాములు దోపిడీ, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ అప్పటి సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీ జిల్లా కార్యదర్శి బోడకుంటి సత్తయ్య అలియాస్ భూమన్న నాయకత్వంలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. అంచెలంచెలుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. మల్లయ్య మరణంపై కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మావోయిస్టుల్లో పెద్దపల్లి జిల్లా నుంచి 11మంది

- కేంద్ర కమిటీలో ముగ్గురు
- ఏడాదిలో ఎన్‌కౌంటర్లలో ఇద్దరు మృతి
- కీలక బాధ్యతల్లో కంకణాల రాజిరెడ్డి

కోల్‌సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో పెద్దపల్లి జిల్లా నుంచి 11మంది ఉన్నారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు కాగా, ఇద్దరు రాష్ట్ర కమిటీ, మిగతావారు జిల్లా కమిటీల్లో పని చేస్తున్నారు. పెద్దపల్లికి చెందిన మల్లవరపుల వేణుగోపాల్ అలియాస్ ప్రహ్లాద్, మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాజిరెడ్డి, జూలపల్లి మండలం వడ్కాపూర్‌కు చెందిన పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న కేంద్ర కమిటీ సభ్యులుగా పని చేస్తున్నారు. సబ్బితం గ్రామానికి చెందిన గంకిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు రామగుండానికి చెందిన అప్పాసి నారాయణ, పాలితం గ్రామానికి చెందిన ఆలేటి రామలచ్చులు, కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్‌రావు, జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన దీకొండ శంకరయ్య, గోపయ్యపల్లికి చెందిన దాతు ఐలయ్యలు డివిజన్ కమిటీ, ఏరియా కమిటీల్లో పని చేస్తున్నారు. రాణాపూర్‌కు చెందిన ఏగోళపు మల్లయ్య ఛత్తీస్‌గఢ్‌లో డివిజన్ కమిటీ సభ్యుడిగా పని చేయగా అతనికి ఏటూరునాగారం-మహదేవాపూర్ కమిటీ బాధ్యతలు అప్పగించారు. అతడు ఆదివారం ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఆరునెలల క్రితం పాలకుర్తి మండలం జయ్యారంనకు చెందిన చీమల నర్సయ్య ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఏడాదిలో జిల్లాకు చెందిన ఇద్దరు అజ్ఞాత మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందారు. ఇంకా జిల్లా నుంచి 11మంది మాత్రమే పార్టీలో కొనసాగుతున్నారు. మల్లవరపుల వేణుగోపాల్, పుల్లూరి ప్రసాద్‌రావు, మల్లా రాజిరెడ్డి కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. కిష్టంపేటకు చెందిన కంకణాల రాజిరెడ్డి ఉత్తర తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాల్లో కీలకంగా ఉన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో పార్టీ కార్యకలాపాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉన్న నాయకులంతా 25 ఏళ్ల క్రితం ముందే అజ్ఞాతంలోకి వెళ్లారు.

సమాచారం

పేదలకు వరం.. విదేశీ విద్యా నిధి

Ambedkar Overseas Vidya Nidhi

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశాల్లో చదివేందుకు అవకాశం
- రూ.20 లక్షల ఆర్థిక సహాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు విదేశాల్లో చది వేందుకు 2014 సంవత్సరంలో విదేశీ విద్యా నిధి పథకాన్ని ప్రారంభించింది. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థికసాయం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం, మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి పథకం, బీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాఫూలే విదేశీ విద్యానిధి పథకం అమలు చేస్తోంది. ప్రతిభ, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి 20 లక్షల రూపాయల ఆర్థికసాయం అందిస్తోంది. ఈ పథ కాల ద్వారా జిల్లాలో 2023-24 సంవత్సరానికి అత్యధికంగా ఎస్సీ విద్యార్థులు 8మంది విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సాయం పొందారు. బీసీల్లో నలుగురు విద్యార్థులు ప్రభుత్వ సహ కారంతో విదేశాల్లో చదువుతున్నారు. ఒక ఎస్టీ విద్యార్థి విదేశీ విద్యానిధికి అర్హత సాధించారు. మైనార్టీల్లో ఆరుగురు అర్హత సాధించగా వారికి ఇంకా నిధులు మంజూరు కాలేదు. 2024-25 సంవత్సరానికి గాను దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

అర్హులు ఎవరంటే...

- ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- జీఆర్‌ఈ, జీ మ్యాట్‌లో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఇంగ్లీష్ ప్రొఫీషియెన్సీ టెస్టులో ప్రతిభ చూపాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలి.
- ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే అవకాశం.



ఆన్‌లైన్‌లో దరఖాస్తు

దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థి వివరాలను పూరించి సంబంధిత ధ్రువ పత్రాలను జేపీజీ ఫార్మాట్‌లో జతపర్చాలి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం రెండుసార్లు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి ఆధ్వర్యంలోని కమిటీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపడుతుంది. జీఆర్‌ఈ/జీమ్యాట్‌లో ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎం పిక చేస్తారు. ఎంపికైన వారికి విదేశీ విశ్వ విద్యాలయానికి సంబంధించిన ప్రవేశలేఖ ఆధారంగా రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తారు. వన్‌వే ఎకనామిక్ టికెట్, వీసా ఛార్జీలను చెల్లిస్తారు. మైనార్టీ, ఎస్టీ విద్యార్థులు డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది.

కావలసిన ధ్రువపత్రాలు

-ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రేషన్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, స్థానికత ధ్రువ పత్రం, పదో తరగతి మెమో, చివరి కోర్స్ మా ర్కుల మెమో, బదిలీ సర్టిఫికెట్, జీఆర్‌ఈ, జీమ్యాట్ స్కోర్ కార్డులు, పాస్‌పోర్ట్ కాపీ, బ్యాం కు ఖాతా పాస్ బుక్, విదేశీ విశ్వవిద్యాలయ ప్రవేశ లేఖ.

10 దేశాల్లో చదువుకునే అవకాశం

అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో చదువుకునే అవకాశం కలదు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

సిరిసిల్ల రూరల్/రుద్రంగి, డిసెంబరు, 1 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెలికితీయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన- ప్రజా విజయోత్స వాల్లో భాగంగా మండలంలోని అన్ని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ పోటీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలల్లో, హాస్టల్స్‌లో మెరుగైన వస తులు కల్పిస్తోందని, నాణ్యమైన భోజనం అందిస్తోందని అన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి చదువులో మంచి ఉత్తీర్ణత సాధించాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణం వెంకంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఎంఈవో రఘుపతి పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వ పాలనపై వ్యాసరచన పోటీలతోపాటు డ్రాయింగ్ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, శ్రీనివాస్, ఇప్పకాయల ప్రకాష్, సీఆర్‌పీ దేవయ్య పాల్గొన్నారు.



చందుర్తిలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో మండల స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎంఈవో వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖ నం పోటీలను ఆదివారం నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశామని ఎంఈవో కృష్ణహరి పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్‌లో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఆదివారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మ్యాకల పర్శరాములు, నాయకులు గొల్లపల్లి పర్శరాములు, సమీర్, నాగం ఐలయ్య, కోరే దేవయ్య, పెద్ది మల్లయ్య, నాగం సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మామిండ్ల కిషన్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు నాయకులు మల్లారెడ్డి, దేవయ్య, రాములు, రామస్వామి, సాగర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): సిరిసిల్లలో నిరుపేద కుటుంబాలకు చెందిన నలుగురు విద్యార్థుల చదువు కోసం సిరిసిల్ల స్వా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అలేఖ్య, శివాని, అంచల్, వైష్ణవి విద్యార్థినులకు రూ.5వేల చొప్పున అందించినట్లు సంస్థ అధ్యక్షుడు మోతే దేవిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పంజాల వెంకటేశ్వర్లు, చంద్రం, పాతూరి మహేందర్‌రెడ్డి, దుమాల రాంనాథ్‌రెడ్డి, గోవర్ధన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆవిష్కరణల తయారీకి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణల తయారీ కోసం అవసరమైన నైపుణ్యాని పెంచుకోవాలని ప్రముఖ టెక్నీషియన్లు జక్కని సుధాకర్, ఆడెపు నవీన్, ఎనగందుల రమేష్, తుమ్మ శ్రీకాంత్, వీరబత్తిని సాగర్ అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో నాలుగు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్‌ల్యాబ్‌లో ఆదివారం సూపర్ పిప్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవిష్కరణల తయారీలో నేర్చు కోవాల్సిన ప్రాథమిక నైపుణ్యాలపై వివరిం చారు. ఏటీఎల్ ఇన్‌చార్జి పాకాల శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

వేములవాడ టౌన్, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి అన్నపూర్ణ నిత్యన్నదాన సత్రం ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాటికొండ పవన్ వాణి దంపతులు ఆదివారం పట్టణంలో సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనకరపు రాకేష్, డైరెక్టర్‌లు ఖమ్మం గణేష్, చైత కుమార్, చికోటి నాగరాజు, షేక్ సాబీర్, వస్తాద్ కృష్ణ, కనుకయ్య, గుర్రం విద్యాసాగర్, ఉప్పల రాజేందర్, నారాజు ఉన్నారు.

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్‌ను భీమేశ్వర మేదరి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు దేవయ్య, వెంకటేశం, అరవింత్, తిరుపతి, అనిల్, రాజనర్సు ఉన్నారు.

బీసీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం

కోనరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ ఎస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనానికి మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్‌తో కలసి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మండలంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తోందన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో అసమానతలు రూపుమాపేందుకు కుల గణన చేపడతామని ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజులకు ప్రాధాన్యం కల్పించనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా కోనరావుపేట మండలానికి అంబులెన్స్



సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముదిరాజ్ మండల సంఘం భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు.ముదిరాజ్ సంఘం నాయకులు సిరిసిల్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చందనగిరి గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మండల నాయకులు ఫిరోజ్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలి



బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ మురళి

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పాటుపడాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్, ఇల్లంతకుంటలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలను ఆదివారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో 26,505 పాఠశాలలు ఉండగా కేవలం ఒక్కదానిలో మాత్రమే ఫుడ్‌పాయిజన్ అయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై పూర్తి నివేదికలు తెప్పించుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల కింద పనిచేసే హాస్టళ్లకు ఒకే విధమైన బడ్జెట్, విద్యార్థులకు అందించే మెనూ ఒకేలా ఉండేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. విద్యావ్యస్థలో మార్పులు తీసుకురావడానికి కృషిచేస్తానన్నారు. హాస్టల్‌లోని పరిసరాలు, కిచెన్, డార్మెంటరీ హాల్స్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఈవో రమేష్‌కుమార్, సోషల్‌వెల్ఫేర్ జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజమనోహర్ రావు, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలిన మాలమహానాడు నాయకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్వహించిన సింహగర్జనకు స్థానిక మాలమహానాడు నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మండల అధ్యక్షుడు ఎలుక రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట నుంచి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోసల చంద్రం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోసల ఉపేంద్ర, మండల అధ్యక్షుడు లక్కం బాబు, మాలల ఐక్య వేదిక నాయకులు బిట్ల శివశ్రీనివాస్, నాయకులు తరలివెళ్లారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, తదితర గ్రామాల్లోని మాల సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు.

చందుర్తి : హైదరాబాదులో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జనకు చందుర్తి మండలం నుంచి మాల మహానాడు సంఘం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి అండగా నిలవాలన్నారు. నాయకులు బత్తుల కమలాకర్, బత్తుల ఉదయ్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



గంభీరావుపేటలో మాల మహానాడు నాయకులు

టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

వీర్నపల్లి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 2024-26 సంవత్సరానికి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్ రావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ బలహీన వర్గాల రాజకీయ అభివృద్ధి కోసం పార్టీ స్థాపించారన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో ఎన్నో పథకాలను అందించి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఆవునూరి దయాకర్ రావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు సిరిసిల్ల నియోజకవర్గంలో, వీర్నపల్లి మండలంలో అత్యధిక సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. వీర్నపల్లి మండల మాజీ అధ్యక్షుడు పెడదనపల్లి రాములు, ఎల్లారెడ్డిపేట మండల మాజీ అధ్యక్షుడు చేట్కూరి నారాయణ గౌడ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రాజు

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మంద రాజు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సావనపెల్లి శంకర్, ఉపాధ్యక్షులుగా పట్నం మహేందర్, సావనపెల్లి నాంపెల్లి, కాసుపాక సురేష్, సంయుక్త కార్యదర్శులుగా మంద అజయ్, రాజమల్లయ్యాచ దాసు, ప్రచార కార్యదర్శులుగా కోలపురం మహేష్, కాసుపాక కృష్ణకాంత్, సలహాదారులుగా తడకపెల్లి భూమయ్య, పసుల వెంకటిని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, మండల ఇంచార్జ్ సావనపెల్లి రాకేష్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు రాక్షస పాలన

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాపాలన కాదు రాక్షస పాలన సాగుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆగయ్య మాట్లాడారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. 2007లో నాటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూములను బొల్లి రామ్మోహన్ క్రషర్ నిర్మాణానికి అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. 2007లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో లేదని, కేటీఆర్ కూడా లేరని అన్నారు. 2010లో వివిధ ప్రభుత్వ శాఖలు, అధికారుల అనుమతితో క్రషర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాటి అధికారులు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి అర్ధరాత్రి తమ నాయకుడిని అరెస్టు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. గతంలో కలెక్టర్, ఆర్డీవో, మైనింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులను కేకే మహేందర్‌రెడ్డి మాట విని ప్రస్తుత కలెక్టర్ రద్దు చేశారని, అన్యాయంగా బొల్లి రామ్మోహన్‌పై అక్రమ కేసు పెట్టారని అన్నారు. కోర్టు ద్వారానే కేసు కొట్టుడు పోయి బయటకు వస్తారన్నారు. క్రషర్‌కు సంబంధించిన అనుమతి పత్రాలను ప్రజాక్షేత్రంలో చర్చకు పెడతామన్నారు. కాంగ్రెస్ చేసిన దుర్మార్గపు ఆలోచనని, ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి కలెక్టర్‌ను పక్కదారి పట్టించి చేసిన దుర్మార్గాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ అనుచరులపై కక్ష పూరితంగా రాజకీయం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాయకులు నర్సయ్య గుండ్లపెల్లి పూర్ణచందర్, చంద్రయ్య, మ్యాన రవి, రాజన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేములవాడ రూరల్, డిసెంబరు01,(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడపల్లి విష్ణు, చెక్కపల్లి, బొల్లారం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు సంఘ స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు సోయినేని కరుణాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని సినీ హీరో శ్రీకాంత్ దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో శ్రావణ్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలో ఉన్నట్లు, ఎప్పటినుంచో వేములవాడ రాజన్న చెంతకు రావాలని అనుకుంటున్నట్లు తెలిపారు. స్వామివారు ఈ రోజు రప్పించుకున్నారన్నారు. ఆయనతో నిర్మాత విజయ్, నటుడు చంద్రకాంత్ ఉన్నారు.

సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయంలోని కళావేదికలో ఆలయ ఏఈవో శ్రావణ్, సూపరింటెండెంట్ అశోక్ ఆదివారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజన్న భక్తులతోపాటు పట్టణానికి చెందిన మహిళలు పలు ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఏఈవో శ్రావణ్ మాట్లాడుతూ శివ కేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైనది కార్తీక మాసమన్నారు. కార్తీక మాసంలో దీపాలు వెలిగించడంతో అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తులకు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో వెన్నెల భక్తి సంగీతం, ఆల్ ఇండియా భారతి శివలీల హరికథ భక్తులను ఆకట్టుకున్నాయి.





సినీహీరో శ్రీకాంత్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు, కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

దీనావస్థలో భీమేశ్వరాలయం

5వ పేజీ తరువాయి..

కదులుతున్నట్లే గోచరిస్తాయి. ఆ శిల్పాలను చూస్తుంటే ప్రదర్శిస్తున్న భ్రమలే కదులుతాయి. అంతటి శిల్ప సంపద మన జిల్లాలో ఉన్న చాలా మందికి తెలియక పోవడం గమనార్హం. వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకోవడానికి లక్ష లాది మంది భక్తులు వస్తుంటారు. స్వామి దర్శనం అనంతరం క్రీస్తు శకం 9వ శతాబ్దం కాలంలో అతి సుందరంగా నిర్మించిన భీమేశ్వర ఆలయాన్ని దర్శించు కుంటారు. వేములవాడను పాలించిన చాళుక్య రాజు బద్దెగుడూ క్రీ.శ.850-895లో నిర్మించారు. దీన్ని మొదట బద్దెగేశ్వరాలయంగా పిలిచేవారు. వేములవాడలోని అన్ని దేవాలయాల కంటే భీమేశ్వర ఆలయానికి ప్రత్యేకత ఉంది. అదే శిల్పకళా వైభవంగా చెప్పుకోవచ్చు. త్రిశూలం, నాగసర్పాలు, మైహిషాసురమర్ధిని, జైన చౌముఖం వంటివే కాకుండా చాళుక్యుల కళా రీతులేన్నో దర్శనమిస్తాయి. ఇలా ఎంతో ప్రాచీనమైన కళా సంపదకు నిలయమైన భీమేశ్వర ఆలయం మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. అనేక శిల్పాలను పట్టించుకోక పోవడంతో ఇప్పటికే శిథిలావస్థకు చేరి పాడైపోతున్నాయి. కొన్ని విగ్రహాలు రూపాన్నే కోల్పోయాయి. కొన్ని శిల్పాలను కనీసం శుభ్రం కూడా చేయక పోవడంతో పూర్తిగా వాటి రూపం కూడా కనిపించని పరిస్థితి. భీమేశ్వరాలయం కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్లే దారిలో 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్ నుంచి వచ్చే వారు సిరిసిల్ల మీదుగా వేములవాడకు చేరుకోవాలంటే 150 కిలోమీటర్లు ప్రయాణించాలి.

పురావస్తు శాఖ నిర్లక్ష్యం

శిల్ప సోయగాలతో కళకళాడిన వేములవాడ భీమేశ్వరాలయం పురావస్తు శాఖ నిర్లక్ష్యంతో శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. 2011లో భీమేశ్వరాలయాన్ని పురావస్తు శాఖ తన పరిధిలోకి తీసుకుంది. రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఆలయాన్ని మళ్లీ కళకళలాడే దిశగా పరిరక్షణకు చర్యలు మాత్రం చేపట్టలేదు. ముందు తరాల వారికి శిల్ప సోయగాలను అందించే దిశగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని చరిత్రకారులు, పర్యాటకులు, వేములవాడ ప్రధాన దేవాలయంతో పాటుభీమేశ్వరాలయాన్ని అభివృద్ధి చేయాలని రాజన్న భక్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొలనూరులో సమావేశమైన పూర్వ విద్యార్థులు, గురువులు

కోనరావుపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1995-96 బ్యాచ్ 7వ తరగతి విద్యార్థులు 25 ఏళ్లు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. అనంతరం దివంగతులైన విద్యార్థులు రాము, కొండల్‌రెడ్డి ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. అప్పటి ఉపాధ్యాయులు లక్ష్మణ్, సత్యనారాయణ, కృష్ణమూర్తిలను సన్మానించారు.

మహిళలు పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వంటల తయారీలో మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టికాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం పద్మనాయక కల్యాణమండపంలో ఓ ప్రైవేటు ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'మన వంట గది.. మన బాధ్యత' అంశంతో పట్టణ స్థాయిలో మహిళలకు నిర్వహించిన వంటల పోటీలను మున్సిపల్ కమిషనర్ లావణ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శ్రీచరణ్ కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన శ్రీచరణ్ అనే విద్యార్థి ఆరు మాసాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఐదు లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, నాయకులు కూరగాయల కొమురయ్య, పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయాలుగా గురుకులాలు

వేములవాడ, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు ప్రజా ప్రభుత్వంలో సమస్యల నిలయాలుగా మారుతున్నాయని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు వెంగళ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. వేములవాడ పట్టణంలోని గురుకుల పాఠశాల, కళాశాలను స్థానిక విద్యార్థి విభాగం నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల్లో వంటగదులు అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. చలికాలం కనీసం వేడి నీళ్లు కూడా స్నానానికి ఇవ్వకపోవడంతో విద్యార్థిని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు పోతు అనిల్, ప్రేమ్ చారి, పర్వేజ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలతో తక్కువ ధరకు సుతారి పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌లపై కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లోని లేబర్ అడ్డాలో ఆదివారం సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అడ్డా కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ కూలీ పనుల కోసం బీహార్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్ర దేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన కూలీలతో తక్కువ ధరకు మాట్లాడుకొని కాంట్రాక్టర్లు పనులు చేయిస్తున్నారని దీంతో సిరిసిల్ల ప్రాంతంలో ఉండే అడ్డా కూలీలకు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కోల శ్రీనివాస్, మండెపల్లి దుర్గయ్య, పోకల దేవయ్య, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తాం

రుద్రంగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందిస్తామని వసతి గృహాధికారి రవీంద్రస్వామి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా భోజనం ముందే రుచి చూసి విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

చందుర్తి: వసతిగృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రవీంద్రస్వామి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలలో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి వార్డెన్ రవీంద్రస్వామి ముందు భోజనం చేసి రుచిని చూసారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.